సాక్షి తిరుపతి

శనివారం ၊ 10 ၊ ఫిబ్రవరి ၊ 2024



తై అమావాస్య పూజలు

జిల్లాలో తై అమావాస్య పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాల బాట పట్టారు. - 8లో



భగవన్నామ స్మరణతో ..

భగవన్నామ స్మరణతో కష్టాలు దూరమవుతాయని శ్రీవిద్యాధీశ తీర్థ స్వామీజీ తెలియజేశారు. - 8లో



రైళ్లలో మద్యం పట్టివేత

రైళ్లలో అక్రమంగా మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని, 15 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. - 8లో

లబ్ధిదారులకు మెగా చెక్కు అందిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, పక్కన జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, కలెక్టర్ షణ్మోహన్





పుంగనూరులో సభకు హాజరైన మహిళలు

''మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలి.. ఆడపడుచులను శక్తిమంతులుగా తీర్చిదిద్దాలి.. సమాజంలో ఉన్నతంగా రాణించేలా ప్రోత్సాహమందించాలి.. అక్కచెల్లెమ్మల అభ్యున్నతికి అనుక్షణం అండగా నిలవాలి''.. ఇదే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం పుంగనూరు నియోజకవర్గంలోని పొదుపు గ్రూపులకు జగనన్న ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మహిళా శక్తికి ఆసరా

- ఆడపడుచుల అభ్యున్నతే లక్ష్యం
- పేదరికమే ప్రామాణికంగా పథకాలు
- పారదర్శకంగా సంక్షేమ ఫలాల పంపిణీ
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



పుంగనూరు : సభలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



పులిచెర్లలో ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

పుంగనూరు : మహిళల ఆర్థిక స్వావలంబనతోనే సమాజాభివృద్ధి సాధ్యమని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం పుంగనూరు పట్టనం, మండలంలోని 1,626 మహిళా గ్రూపులకు వైఎస్సార్ ఆసరా పథకం కింద రూ.14.18 కోట్ల చెక్కులను పంపిణీ చేశారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మెప్మా బజారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని 5,661 సంఘాలకు చెందిన 50,262 మంది మహిళలకు రూ.52.95 కోట్లు పంపిణీ చేశామని వెల్లడించారు. ఆసరా పథకం కింద ఇప్పటి వరకు నాలుగు విడతల్లో మొత్తం రూ. 213.70 కోట్లు అందించామని వివరించారు. మహిళలను ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకే జగనన్న మార్ట్‌లు, ఈ–మార్ట్‌లు ఏర్పాటు చేశామని చెప్పారు. వ్యాపార రంగంలో సైతం ఆడపడుచులు ఉన్నతంగా రాణించేలా ప్రోత్సహిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. నవరత్న పథకాల కింద ప్రజలకు రూ.కోట్లు పంపిణీ చేశామని తెలిపారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా పేదరికమే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, అవినీతికి తావు లేకుండా లబ్ధిదారుల ఖాతాల్లోనే నగదు జమ చేశామని వెల్లడించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించి ఆశీర్వదించాలని కోరారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ మహిళలకు ఎలాంటి సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ ఆసరా, చేయూత, కాపునేస్తం, వాహనమిత్ర, చేదోడు, ఈబీసీ నేస్తం తదితర పథకాల ద్వారా జిల్లాలోని లక్షలాది కుటుంబాలు లబ్ధిపొందాయని వెల్లడించారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. సమావేశంలో మెప్మా ఎండీ విజయలక్ష్మి, పీడీలు రాధా, తులసి, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, బోయకొండ ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చౌడేపల్లె : మండలంలోని ఆరుగురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పంపిణీ చేశారు. ఈ మేరకు చౌడేపల్లెకు చెందిన కె.మాధవికి రూ.6లక్షలు, లద్దిగం గ్రామానికి చెందిన కె.ప్రదీప్‌కుమార్–రూ.6లక్షలు, తిరుమణపల్లె గోవిందురెడ్డి– రూ.70 వేలు, పాత గూబలవారిపల్లెకు చెందిన ఆనందకుమార్– రూ.1.80లక్షలు, దాదేపల్లెకు చెందిన మొబీనాకు రూ.18వేల చొప్పున మొత్తం రూ.14.68 లక్షల చెక్‌లు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తి, పార్టీ మండల కన్వీనర్ అంజిబాబు, జేసీఎస్ కన్వీనర్ రుక్మిణమ్మ, వైస్ ఎంపీపీలు సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, బోయకొండ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ శంకర్ నారాయణ, మాజీ ఎంపీపీ రెడ్డి ప్రకాష్ పాల్గొన్నారు.



చౌడేపల్లె : లబ్ధిదారుకు చెక్ అందిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ఎన్నికల నిర్వహణకు సిద్ధం

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ జీ.లక్ష్మీశ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌తోపాటు జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, మునిసిపల్ కమిషనర్ అదితిసింగ్, డీఆర్‌ఓ పెంచల్‌కిషోర్, ఎన్నికల విధులు కేటాయించిన వివిధ శాఖల అధికారులతో ఎన్నికల సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ రానున్న ఎన్నికల నేపథ్యంలో డబ్బు, మద్యం, అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచనున్నట్టు వెల్లడించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ వెంకట్రావు, అసిస్టెంట్ కమిషనర్ జీఎస్టీ ఉమేష్ కుమార్, సెబ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ రమేష్, ఆర్వోలు నిశాంత్‌రెడ్డి, కిరణ్ కుమార్, చంద్రముని, రవిశంకర్‌రెడ్డి, నరసింహులు, ప్రోటోకాల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్ నాయుడు, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బాగా చదవాలి.. గర్వపడేలా ఎదగాలి!





హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు, (ఇన్‌సెట్) సీ.గొల్లపల్లిలో చెవిరెడ్డి విద్యాకానుకను అందిస్తున్న వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- విద్యారంగంలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శం
- జగనన్న స్ఫూర్తి, ఎమ్మెల్యే చెవిరెడ్డి ఆశీస్సులతో పుస్తకాలు పంపిణీ
- 395 పాఠశాలల్లో 23,150 మందికి అందజేత
- తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: 'బాగా చదవాలి.. మంచి ఉద్యోగం సాధించాలి. సమాజానికి మంచిచేస్తూ కన్న తల్లిదండ్రులు గర్వపడేలా ఎదగాలి' అని తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. నియోజకవర్గ పరిధిలోని 395 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 23,150 మంది విద్యార్థులకు 2,77,800 నోటు పుస్తకాలు, 23,150 రైటింగ్ ప్యాడ్‌లు, 96,600 మెదడును పదునుపెట్టే ఫజిల్స్ సెట్‌ల(ఆట వస్తువులు)తో కూడిన విద్యాకానుకను అందించే కార్యక్రమాన్ని శుక్రవారం తిరుపతి రూరల్ మండలం, సీమల్లవరం పంచాయతీలో ఆయన ప్రారంభించారు. అనంతరం పాతకాల్వ, పైడిపల్లి, సి.గొల్లపల్లి, రామానుజపల్లి, మల్లంగుంట, చిగురువాడ, కేసీపేట, దుర్గసముద్రం, కుంట్రపాకం, తనపల్లి పంచాయతీల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల వద్దకు వెళ్లి నోటు పుస్తకాలు, రైటింగ్ ప్యాడ్స్, బ్రెయిన్ ఎక్సర్ సైజ్ ఫజిల్ షీట్‌లతో కూడిన చెవిరెడ్డి విద్యాకానుక కిట్‌ను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా 395 పాఠశాలల్లో 23,150 మంది విద్యార్థులకు పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేసినట్టు వెల్లడించారు. విద్యా రంగంలో రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా నిలిపిన జగనన్న పరిపాలనను స్ఫూర్తిగా తీసుకుని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆశీస్సులతో ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు వెల్లడించారు. ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు పరీక్షలు ప్రారంభమవుతున్న తరుణంలో నోటు పుస్తకాల పంపిణీ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పిల్లలు, వారి తల్లిదండ్రులు బాధ్యతగా హాజరవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

సరస్వతీ పూజతో ప్రారంభం

మొదటగా సి.మల్లవరం ఎంపీపీ స్కూల్ ఆవరణలో సరస్వతీ పూజచేసి పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని మోహిత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. విద్యా కానుక కిట్‌ను, అందులోని కానుకలను చూస్తూ విద్యార్థులు మురిసిపోయారు. మోహిత్ అన్న ఇచ్చిన కానుక సూపర్... అంటూ కొందరు విద్యార్థులు తల్లిదండ్రులతో చెబుతుండడం కనిపించింది. ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తిరుపతి రూరల్ మండలం సీ మల్లవరంలో విద్యాకానుక కిట్లు అందుకున్న విద్యార్థులతో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

నేటి నుంచి జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన



ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న విద్యాశాఖ అధికారులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శని, ఆదివారాలు రెండు రోజుల పాటు జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్నట్టు జిల్లా సైన్స్ అధికారి భాను ప్రసాద్ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ వైజ్ఞానిక మేళాను ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, కలెక్టర్ లక్ష్మీశ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్టు తెలిపారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, డీఈఓ డాక్టర్ శేఖర్, ఇతర ప్రముఖులు విచ్చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి 380 నమూనాలు ప్రదర్శనకు రానున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు. సమగ్ర శిక్ష సీఎంఓ సురేష్, ఎంఈఓలు భువనేశ్వరి, బాలయ్య, భాస్కర్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు

క్రమశిక్షణతో ఉజ్వల భవిత





హాజరైన విద్యార్థులు, టీటీడీ అధికారుల నుంచి అఛీవ్‌మెంట్ అవార్డు అందుకుంటున్న విద్యార్థిని

- టీటీడీ కళాశాలల విద్యార్థులు అదృష్టవంతులు
- 215 మంది విద్యార్థులకు అఛీవర్ అవార్డులు
- టీటీడీ ఈఓ ఏవీ.ధర్మారెడ్డి

తిరుపతి కల్చరల్ : టీటీడీ కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులందరూ ఎంతో అదృష్టవంతులని, ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో విద్యనభ్యసించినప్పుడే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోగలరని ఈఓ ఏవీ.ధర్మారెడ్డి తెలిపారు. శుక్రవారం తిరుపతి మహతి ఆడిటోరియంలో జరిగిన స్టూడెంట్స్ సక్సెస్ మీట్ – అఛీవర్ అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. అకడమిక్స్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్, కల్చరల్, కో–కరికులర్, కాంపిటేటివ్ ఎగ్జామ్స్, ప్లేస్మెంట్స్ తదితర విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 215 మంది విద్యార్థులకు 5 గ్రాముల వెండి డాలర్, ప్రశంసాపత్రాలను అందించారు. అనంతరం ఈఓ మాట్లాడుతూ టీటీడీ ఆధ్వర్యంలోని 27 విద్యాసంస్థల విద్యార్థులందరినీ ఒక వేదికపైకి తీసుకొచ్చి అవార్డులు అందించడం ఎంతో సంతోషకరమన్నారు. అధ్యాపకులు విద్యార్థుల క్రమశిక్షణ విషయంలో రాజీ పడొద్దని సూచించారు. అవసరమైతే వారి తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. త్వరలో 120 మంది జూనియర్ లెక్చరర్లు, డిగ్రీ లెక్చరర్ల నియామకానికి చర్యలు చేపట్టనున్నట్టు వెల్లడించారు. టీటీడీ జేఈఓ సదాభార్గవి మాట్లాడుతూ విద్యను కొనకూడదు.. అమ్మకూడదు అనే మహోన్నత లక్ష్యంతో టీటీడీ విద్యాసంస్థలను నిర్వహిస్తోందని తెలిపారు. ఎస్వీ వేద వర్సిటీ ఉపకులపతి ఆచార్య రాణిసదాశివమూర్తి మాట్లాడుతూ శారీరక వికాసం కోసం క్రీడలు, యోగా సాధన చేయాలని సూచించారు. టీటీడీ విద్యాశాఖాధికారి డాక్టర్ ఎం.భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఒకే మేనేజ్మెంట్ ఆధ్వర్యంలోని మూడు కళాశాలలకు న్యాక్–ఏ ప్లస్ గ్రేడ్‌తో పాటు అటానమస్ హోదా రావడం చరిత్రాత్మకమన్నారు. ఏపీఆర్‌ఓ పీ.నీలిమ, శ్రీపద్మావతి మహిళా డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ కృష్ణవేణి, ఎస్వీ సంగీత కళాశాల హరికథ విభాగం అధ్యాపకులు వెంకటేశ్వర్లు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. టీటీడీ ముఖ్య గణాంకాధికారి శేషశైలేంద్ర, టీటీడీ విద్యావిభాగం సలహాదారు ఎల్ఆర్.మోహన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

గురువే ప్రత్యక్ష దైవం



మాట్లాడుతున్న ఎంబీయూ చాన్స్‌లర్ మంచు మోహన్‌బాబు

చంద్రగిరి: గురువే బ్రహ్మ, గురువే విష్ణు, గురువే మహేశ్వరుడు అని ప్రతి విద్యార్థి భావించినప్పుడే అన్ని రంగాల్లోనూ రాణించగలరని మోహన్‌బాబు యూనివర్సిటీ (ఎంబీయూ) చాన్స్‌లర్ డాక్టర్ మంచు మోహన్‌బాబు తెలిపారు. ఎంబీయూలో ఇంజినీరింగ్, ఫార్మసీ, నర్సింగ్, డిప్లొమా, అగ్రికల్చర్, పారా మెడికల్ కోర్సులలో నూతనంగా చేరిన విద్యార్థులతో శుక్రవారం ఆయన ఓపన్ ఆడిటోరియంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

వినతులకు అర్థవంత పరిష్కారం



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

శ్రీకాళహస్తి: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీకి అర్థవంత పరిష్కారం చూపాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని ఎస్ఎస్ ఫంక్షన్ హాల్లో శుక్రవారం జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 45 వినతులు వచ్చినట్టు ఆయన వెల్లడించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సేవలపై సచివాలయ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆర్థికేతర అర్జీలను ఎట్టి పరిస్థితుల్లో పెండింగ్‌లో ఉంచరాదని చెప్పారు. ఆర్డీఓ రవిశంకర్, డీఎల్డీవో ఆదిశేషారెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి పంటలతో పౌష్టికాహారం



స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న పీడీ జ్యోతి

తిరుపతి అర్బన్: ప్రకృతి పంటలతో పౌష్టికాహారం మెండుగా ఉంటుందని డీఆర్‌డీఏ పీడీ జ్యోతి తెలిపారు. శుక్రవారం ఆమె తిరుపతిలోని తమ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ స్టాల్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యసాయ పద్ధతుల్లో పండించిన ఆకు కూరలు, కూరగాయలతో పాటుగా తీగజాతి, దుంప జాతీ ఉత్పత్తులు ఉత్పత్తులను ఈ స్టాల్‌లో ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. ప్రకతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన ఉత్పత్తులను ఈస్టాల్‌లో రైతులు విక్రయించుకోవచ్చని తెలిపారు. డీపీఎంఏ షణ్ముగం, అడిషనల్ పీడీ పీ.ప్రభావతిరెడ్డి, అడిషనల్ డీపీఎం పట్టాభిరెడ్డి, డీపీఎం మాధవి, ఎస్ఎఫ్ఏ మధు, ఎంటీ రాగమ్మ, సుజాత పాల్గొన్నారు.

ముగిసిన మహా రుద్రాభిషేకం



అమ్మవారికి అభిషేకం చేస్తున్న సూర్యనారాయణమూర్తి

తిరుపతి కల్చరల్: హైదరాబాద్‌కు చెందిన శ్రీగురుదత్త మఠం వ్యవస్థాపకుడు సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో శ్రీపద్మావతి కల్యాణ మండపం బ్లాక్–2లో రెండు రోజులుగా చేపట్టిన మహా రుద్రాభిషేక సహిత శ్రీదేవి పూజా మహోత్సవాలు శుక్రవారం ముగిశాయి. మహా పూర్ణాహుతితో కామాక్షి అమ్మవారి అభిషేక పూజా మహోత్సవాలు ఘనంగా ముగిశాయి.

'శ్రీనివాససేతు'కి జాతీయ స్థాయి గుర్తింపు



అవార్డు స్వీకరిస్తున్న కార్పొరేషన్ అధికారులు

తిరుపతి తుడా: టీటీడీ సహకారంతో నిర్మించిన శ్రీనివాస సేతు ఎలివేటెడ్ కారిడార్‌కు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్రిడ్జి ఇంజినీర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ముంబైలోని ఓ ఆడిటోరియంలో అవార్డు అందించారు. ఈ అవార్డును కేంద్ర మంత్రి నితిన్ గడ్కారీ వర్చువల్ విధానంలో ప్రారంభించగా.. తిరుపతి స్మార్ట్ సిటీ సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, ఆఫ్కాన్స్ ప్రతినిధి రంగస్వామి అవార్డును అందుకున్నారు.

క్లుప్తంగా

సీసీఎల్ టీ-20 క్రికెట్ సెలెక్షన్లు రేపు

తిరుపతి రూరల్: చిత్తూరు క్రికెట్ లీగ్(సీసీఎల్) టి–20 సెలెక్షన్లను ఈ నెల 11వ తేదీన నిర్వహించనున్నట్లు చిత్తూరు జిల్లా బాయ్స్ అండ్ గరల్స్ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని మూడు డివిజన్లలో ఈ సెలక్షన్లు జరుగుతాయన్నారు. తిరుపతి పరిధిలో తుమ్మలగుంట వైఎస్సార్ క్రీడా మైదానంలో, చిత్తూరు ఆర్టీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న పోలీస్ గ్రౌండ్స్, మదనపల్లెలో మాస్టర్ మైండ్స్ స్కూల్ ఎదురుగా ఉన్న క్రికెట్ నెట్స్‌లో సెలక్షన్లు ఉంటాయని తెలిపారు. 1994 సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి 2008 సెప్టెంబర్ ఒకటో తేదీ మధ్య జన్మించిన వారే అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు తెల్లని దుస్తులు, సొంత క్రీడా సామగ్రితో హాజరుకావాలన్నారు. ఆధార్ కార్డుతో పాటు జనన ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని సూచించారు. ఇతర సమాచారం కోసం తిరుపతిలో 98490 26131, చిత్తూరులో 90144 40543, మదనపల్లెలో 70130 31459 సంప్రదించాలని కోరారు.

జలపాతంలో యువకుడి గల్లంతు


శ్యామ్

నాగలాపురం: మండలంలోని జంభుకేశవపురం సమీపంలోని సద్దికూడు మడుగు జలపాతంలో తమిళనాడులోని కుంద్రత్తూర్‌కు చెందిన శ్యామ్(20) గల్లంతయ్యాడు. విహార యాత్రకు తొమ్మిది మంది యువకులు రాగా.. అందరూ జలపాతంలో జలకాలాడేందుకు సిద్ధమయ్యారు. అందులో శ్యామ్ నీటిలో మునిగిపోవడంతో వెంటనే డయల్ 100 ఫోన్ చేసి సమాచారం అందించారు. ఎస్ఐ ఓబయ్య, కానిస్టేబుల్ దివాకర్, సాయికిరణ్, భూపతి జలపాతంలో వెదికినా ప్రయోజనం లేకపోయింది. చీకటి పడడంతో చేసేదిలేక వెనుదిరిగారు.


శ్రీకాళహస్తి : స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు


హాజరైన ప్రముఖులు, భక్తులు

శాస్త్రోక్తంగా తై అమావాస్య పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో శుక్రవారం భరద్వాజ తీర్థంలో శాస్త్రోక్తంగా తైఅమావాస్య పూజలు నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలోని స్వామి, అమ్మవార్లకు విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను చప్పరాలపై అధిష్ఠింపజేసి ఊరేగింపుగా భరద్వాజతీర్థానికి తీసుకెళ్లారు. అక్కడ శివాలయం ఆవరణలో స్వామి, అమ్మవార్లను ఉంచి పసుపు, చందనం, కుంకుమ, విభూది, పాలు, నారికేళం, పెరుగు, పంచామృతంతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లు ఆలయానికి వేంచేపు చేశారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయానికి పోటెత్తిన భక్తులు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయానికి శుక్రవారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తై అమావాస్య చివరి శుక్రవారం కావడంతో ఉదయం నుంచే భక్తులు క్యూ కట్టారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఆలయ డిప్యూటీ ఈఓ గోవిందరాజన్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. అమ్మవారి దర్శనానికి సుమారు రెండు గంటల పాటు సమయం పట్టింది. ఈ సందర్భంగా సాయంత్రం చేపట్టాల్సిన కుంకుమార్చన సేవలను అధికారులు రద్దు చేశారు. సాధారణ రోజులకంటే అధికంగా శుక్రవారం అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

తిరుచ్చిపై దివ్యదర్శనం

వారపు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం అమ్మవారు తిరుచ్చి వాహనంపై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. ఉదయం అమ్మవారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం అభిషేకసేవను చేపట్టి, శోభాయమానంగా అలంకరించారు. తదుపరి శ్రీకృష్ణముఖమండపంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని పాంచరాత్ర ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి విద్యుత్ దీపకాంతుల నడుమ ఊంజల్ సేవను నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తి తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడ వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.


తిరుచ్చిపై కనువిందు చేస్తున్న శ్రీపద్మావతి అమ్మవారు


తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

భగవన్నామస్మరణతో కష్టాలు దూరం

- శ్రీ విద్యాధీశ తీర్థ స్వామీజీ
- ఘనంగా రెండో రోజు పురందరదాసు మహోత్సవాలు
- 12 మంది యువ కళాకారులకు ప్రతిభా పురస్కారాలు

తిరుమల: కలియుగంలో యజ్ఞాలు, యాగాలు, తపస్సు చేయకపోయినా హరినామస్మరణ చేస్తే ఎంతటి కష్టమైనా దూరం అవుతుందని ఉడిపి పాలిమారు మఠాధిపతి విద్యాధీశతీర్థ స్వామీజీ తెలిపారు. పురందరదాసుల ఆరాధన మహోత్సవాలు రెండో రోజు శుక్రవారం తిరుమలలోని ఆస్థాన మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాధీశతీర్థ స్వామీజీ మాట్లాడుతూ పురందరదాసు కీర్తనలు యావత్తూ లోకోక్తులేనన్నారు. మానవాళికి పురందరదాసు జీవితసారమే ఆదర్శప్రాయమన్నారు. కేవలం ధనార్జనే ప్రధానంగా భావించిన వ్యక్తి తాను ఎదుర్కొన్న కొన్ని సంఘటనల ద్వారా జ్ఞానసిద్ధి పొంది ప్రఖ్యాత హరిదాసులుగా ఖ్యాతిచెందారన్నారు. దాస పదాల ద్వారా అందరికీ అర్థమయ్యేలా సులువుగా భగవంతుని తత్వాన్ని, శరణాగతి విధానాన్ని, ధర్మాన్ని, నైతిక విలువలను తెలియజేశారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యాధీశతీర్థ స్వామీజీ, పాలిమారు మఠం ఉత్తరాధికారి విద్యారాజేశ్వతీర్థ స్వామిజీతో కలిసి దాససాహిత్యంలో విశేష కృషి చేసిన 12 మంది యువ కళాకారులకు ప్రతిభ పురస్కారాలు అందజేశారు. దాససాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి పీఆర్ ఆనంద తీర్థచార్యులు ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాతం, ధ్యానం, సామూహిక భజన, నగర సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి 3500 మంది భజన మండళ్ల సభ్యులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను త్వరితగతిన చేపట్టాలి


ఐఐటీలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

ఏర్పేడు: ఐఐటీ పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని మేర్లపాక రెవెన్యూలో ఉన్న ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో ఐఐటీకి సంబంధించిన పలు అంశాలపై జేసీ శుభం భన్సల్‌తో కలిసి ఐఐటీ, ఆర్‌డబ్ల్యూ, ఎస్పీడీసీఎల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఐఐటీ వద్ద బస్ స్టాప్ ఏర్పాటుకు ఎన్‌హెచ్ అధికారులు త్వరితగతిన క్లియరెన్స్ ఇవ్వాలన్నారు. లెవెల్ క్రాసింగ్ క్లోజర్‌పై రెవెన్యూ అధికారులు క్లియరెన్స్ ఇవ్వాలని, తాగునీరు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌కు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు దృష్టి సారించాలని చెప్పారు. వీధి దీపాల ఏర్పాటుకు సంబంధించి అంచనాల ప్రణాళికలను వారంలోపు తయారు చేయాలని ఎస్పీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ గార్బేజ్ డిస్పోజల్ సిస్టం ఏర్పాటుకు శాశ్వత పరిష్కార దిశగా ప్రణాళికలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఐఐటీ అధికారులకు సూచించారు. ఐఐటీ డీన్ ప్లానింగ్ ఇన్‌ఫ్రాస్టక్చర్ మురళీకృష్ణ, డిప్యూటీ రిజిస్ట్రార్ చమన్‌మెహతా, ఈఈ సివిల్ చైతన్య, శ్రీకాళహస్తి ఆర్డీఓ రవిశంకర్‌రెడ్డి, ఎస్పీడీసీఎల్ ఎస్ఈ కృష్ణారెడ్డి, ఆర్‌డబ్ల్యూ ఎస్ఈ విజయకుమార్, జీ సెక్షన్ సూపరింటెంట్ భాస్కర్ పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక


వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో బియ్యపు పవిత్రారెడ్డి

ఏర్పేడు: మండలంలోని పాయిల్ సెంటర్‌లో 50 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు వైఎస్సార్ సీపీలో చేరారు. శుక్రవారం మండలంలోని పాయిల్ సెంటర్‌లో వైఎస్సార్ సీపీ రేణిగుంట మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి సార్వత్రిక ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని టీడీపీకి చెందిన లోకనాథం, శశికుమార్, పవిత్ర, రవి, వెంకటేష్, వెంకటసుబ్బయ్య, గోవిందయ్య, భానుమతి, సుబ్రమణ్యం, పురుషోత్తం, మోహన్, మహేంద్ర, దేశమ్మ, కృష్ణయ్య, మునెమ్మ తదితర 50 మంది నాయకులు, కార్యకర్తలు, మహిళలకు బియ్యపు పవిత్రారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా పవిత్రా రెడ్డి వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రమణయ్యయాదవ్, సర్పంచ్‌లు సుబ్రమణ్యం, మోహనప్రియ, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ నాయకులు మధుయాదవ్, సాయి, శ్రీమంతుల రామయ్య ఆచారి, రాజశేఖర్‌రెడ్డి, గురునాథం, కేశవులురెడ్డి, జీపీ యాదవ్, సయ్యద్ కరీముల్లా, రాజా, కన్నయ్య, బ్రహ్మయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

వన్నెకుల జైత్రయాత్ర మహాసభ రేపు

శ్రీకాళహస్తి: పట్టణంలోని శివం కల్యాణ మండపంలో ఈనెల 11న నిర్వహించే వన్నెకుల క్షత్రియుల జైత్రయాత్ర మహాసభను జయప్రదం చేయాలని రష్ ఆస్పత్రి అధినేత, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ పిలుపునిచ్చారు. శుక్రవారం వన్నెకుల జైత్రయాత్ర జరిగే శివం కల్యాణ మండపాన్ని పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అత్యధిక జనాభా వన్నెరెడ్లే ఉన్నారని గుర్తుచేశారు. పల్లవ రాజ వంశానికి చెందని వన్నెరెడ్లు ధైర్య, సాహసాలకు ప్రతీకలన్నారు. అలాంటి వన్నెరెడ్లు ఏకతాటిపై చేరి ఐక్యతగా ఉండాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మాజీ మంత్రిమోపిదేవి వెంకటరమణ, ఎమ్మెల్సీ భరత్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్‌రెడ్డి, స్వామిరెడ్డి భరత్‌రెడ్డి, మురళీరెడ్డి, మధురెడ్డి, రత్నంరెడ్డి, దాము రెడ్డి, జగదీశ్‌రెడ్డి, డాక్టర్ బాబు పాల్గొన్నారు.


సమావేశమైన వన్నెకుల క్షత్రియులు

అట్టహాసంగా విద్యావైజ్ఞానిక ప్రదర్శన


వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని బీపీ అగ్రహారంలో ఉన్న విజయవాణి ఉన్నత పాఠశాలలో 11వ వార్షిక విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను రాష్ట్ర ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ చైర్మన్ గొల్లపూడి మోహన్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ చెవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ ప్రదర్శన మూడు రోజుల పాటు జరగనుంది. ఈ సైన్స్‌ఎక్స్‌పోలో 173 ప్రాజెక్టులను వివరించేందుకు 200 మంది విద్యార్థులు, గైడ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మొదటి రోజు దాదాపు 500 మంది విద్యార్థులు వచ్చి వీక్షించారు. ఈ ప్రదర్శనలో ఇండియన్ అచీవ్‌మెంట్స్ ఇన్ రాకెట్ అండ్ శాటిలైట్ సైన్స్, ప్లాస్టిక్‌రోడ్డు, సోలార్ పవర్ టెక్నాలజీ, హైడల్ పవర్‌ప్లాంట్, న్యూక్లియర్ పవర్ వంటి ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ప్రైవేట్ పాఠశాలల అధినేతలు ఢిల్లీబాబు, సుబ్బరామిరెడ్డి, జితేంద్ర, సుధాకర్, రఫీ, ప్రేమ్‌కుమార్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

వాస్తవాల ప్రతిరూపమే యాత్ర-2


యాత్ర-2 సినిమాను వీక్షిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు

సైదాపురం(వెంకటగిరి): యాత్ర –2 సినిమా వాస్తవాల ప్రతిరూపమని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి, ఆయన తనయుడు, ప్రస్తుత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జీవిత కథ ఆధారంగా తీసిన ఈ సినిమా గురువారం రాష్ట్ర వ్యాప్తంగా విడుదలైందన్నారు. వెంకటగిరి పట్టణంలో జ్యోతిమహల్‌లో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి శుక్రవారం యాత్ర–2 సినిమాను నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ చూడ తగ్గ సినిమా అన్నారు.

రైళ్లలో అక్రమ మద్యం పట్టివేత

రేణిగుంట: రేణిగుంట రైల్వే స్టేషన్‌లో రైళ్ల తనిఖీలలో భాగంగా శుక్రవారం అక్రమంగా తరలిస్తున్న 15 మద్యం బాటిళ్లను రేణిగుంట జీఆర్పీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేశారు. రేణిగుంట జీఆర్పీ ఎస్ఐ రవి, ఎలక్షన్ ఎన్ఫోర్స్‌మెంట్ బృందంతో కలిసి శుక్రవారం రేణిగుంట స్టేషన్లో ఆగిన పలు రైళ్లను తనిఖీలు చేశారు. ఎగ్మోర్ నుంచి కాచిగూడ వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలులో చిత్తూరు జిల్లా, పీలేరు మాడ్రన్ కాలనీకి చెందిన ఎం.సుకుమార్(47) 15 మద్యం బాటిళ్లను తీసుకెళుతున్నట్లు గుర్తించారు. మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడ్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అలాగే అతని వద్దనున్న రూ.4,344ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 22 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 57,357 మంది స్వామివారిని దర్శించుకున్నారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది.


మద్యం విక్రేతపై కేసు

శ్రీకాళహస్తి : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళపై కేసు నమోదు చేసిన సంఘటన మండలంలోని చిట్టత్తూరు ఎస్సీ కాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది. తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర కథనం.. మండలంలోని చిట్టత్తూరు ఎస్సీ కాలనీలో ఎల్లమ్మ అనే మహిళ మద్యం అక్రమంగా విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో అకస్మాత్తుగా దాడులు నిర్వహించడంతో ఆమె వద్ద 12 మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయి. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, ఆమెపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

తడ: జాతీయ రహదారిపై తడకండ్రిగ పంచాయతీ, బీఎల్‌పాడు గ్రామం క్రాస్ రోడ్డు వద్ద గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. ఎస్ఐ జేపీ.శ్రీనివాసరెడ్డి కథనం.. గుమ్మిడిపూండి తాలూకా, రాఘవరెడ్డి మేడు గ్రామానికి చెందిన ఎం.జోదిష్(18) గురువారం తన గ్రామానికే చెందిన మిత్రుని బైక్ తీసుకుని తడ మండలం, కొండూరు గ్రామంలోని మేనత్త ఇంటికి వచ్చి రాత్రి తిరుగు పయనం అయ్యాడు. బీఎల్‌పాడు క్రాస్‌రోడ్డు వద్ద ముందు వెళుతున్న గుర్తుతెలియని లారీని వేగంగా దాటే ప్రయత్నంలో అదుపు తప్పి వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో జోదిష్ తలకు బలమైన గాయమవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని వద్ద లభించిన సెల్ ఫోన్ ఆధారంగా మృతుని తల్లి నాగమ్మాళ్‌కి ఫోన్ చెయ్యడంతో ఆమె తడకు వచ్చి కుమారుడి మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్రేన్ కింద పడి వ్యక్తి మృతి


మృతి చెందిన గులాబ్

గంగాధర నెల్లూరు : చిత్తూరు– తచ్చూరు హైవే నిర్మాణంలో భాగంగా శుక్రవారం మండలంలోని ముక్కళత్తూరు కండ్రిగ వద్ద సాగుతున్న పనుల్లో క్రేన్ కింద పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన గులాబ్ (48)ప్రమాదవశాత్తూ క్రేన్ హైడ్రాలిక్ కిందపడి అక్కడికక్కడే మరణించాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు సీఐ శంకర్ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించామని సీఐ తెలిపారు.